మాయమైంది. నేను చెప్పినదంతావిని "అతడిని చూడాలి. పద" అంది. నేనుతెల్లబోయి-"అతడిదగ్గిరకా-" అన్నాను.

"అవును. ఏం?"

"మన పల్లెసంగతి మర్చిపోయావా, గోరంత విషయాన్ని కొండత చేస్తారు"

"ఏడిచారు" నిర్లక్ష్యంగా అంది. తను ఏదన్నా అనుకుందీ అంటేఆలస్యం చేయదు. ఇద్దరం అతడి దగ్గిరకి వెళ్ళాం ఒక. చిన్న ఇంట్లో వుంటున్నాడు అతడు. నాకైతే అంత ధైర్యం వుండేదికాదు. తరళ అతడితో గబగబా మాట్లాడేసింది. ముందు క్షమాపణలు చెప్పుకుంది. కానీ కేవలం అది సంభాషణ ప్రారంభించటానికి మాత్రమే. ఆ తరువాత ఇక దాని ప్రసక్తి లేదు. పల్లంలో ప్రవహించే గోదావరిలా గలగలా మాట్లాడుతూంది.

అతడుకూడా ఆసక్తిగావింటున్నాడు.

వాళ్ళిద్దర్ని చూస్తూంటే నాకు ముచ్చటగా అనిపించింది. నేను బాధపడుతున్నానా! లేదని మనస్ఫూర్తిగా అనలేనేమో. కానీ నాకేం అర్హతవుంది. వేశ్య కూతురిగా పుట్టినా, అందం లేదు. అంత వరకూ ఎందుకు? తరళేగానీ 'ఈ రోజు ఇలా తీసుకు రాక పోయివుంటే ఇంకో నాలుగుసంవత్సరాలు గడిచినా అతడితో మాట్లాడే ధైర్యం చేయలేక పోదునేమో. తరళగాబట్టి అంత కలివిడిగా మాట్లాడగల్గుతోంది. డబ్బుకూడాధైర్యాన్నిస్తుంది. ఈ పల్లెలో తనేం చేసినా-గుసగుస లాడుకోవటమేతప్ప పైకి అనే ధైర్యం ఎవరికీ లేదు.

వాళ్ళిద్దరి వైపూ చూసాను.

అప్పుడే మంచి స్నేహితులైపోయినట్లు మాట్లాడేసుకుంటున్నారు. సరళ అంతే. ఏదైనా అనుకుందీ అంటే ఆలస్యం చేయదు. బయట కొచ్చాక అంది. "నేను ప్రేమలో పడిపోయానే" అని.

"అప్పుడే-?"

"ఆహా! లవ్ ఎట్ ఫస్ట్‌సైట్."

నేను మాట్లాడలేదు. తను తల్చుకున్నది సాధించి తీరుతుంది అని తెలుసు. నడుస్తున్నదల్లా ఆగి. "కొంపదీసి నువ్వు గానీ ప్రేమిస్తున్నావా అతగాణ్ని" అంది. నేను నవ్వాపుకుని "లేదు. ఆ మాటకొస్తే నేను అతడిని కలుసు కోవటం కేవలం మూడోసారిమాత్రమే. అదైనా నువ్వున్నావు కాబట్టి" అన్నాను.

భవిష్యత్తులో ఎవరైనా ప్రేమించవలసివస్తే నా దగ్గిర కాస్తధైర్యాన్ని అరువు తీసుకో-"

"తప్పకుండా"

ఆ తరువాత ఆనంద్‌ని కలుసుకునే విషయం తరళ రహస్యంగా వుంచలేదు. మా ఇంటి కొచ్చినప్పుడు అమ్మతో అనేది. అమ్మకి తరళంటే భయం, భక్తి. అసలు తరళ మా ఇంటికి రావటమే అదృష్టంగా భావించేది. నేను వెళ్ళనంటే బలవంతం చేసి పంపించేది. గోదావరి వడ్డున ఆనంద్ ఎదురుచూస్తూ వుండేవాడు. ముగ్గురం చిన్నపడవలో కాలువ అవతలి పక్కకి వెళ్ళేవాళ్ళం. మధ్యాహ్నం పూట అక్కడ తోటలో గడిపే వాళ్ళం.

నాకు మనసులో భయంగా వుండేది. రావుగారికి ఇదంతా తెలుస్తే ఏం గొడవ అవుతుందో అని.

కొన్ని రోజుల తరువాత ఆ ప్రమాదం ఎదురైంది. రావుగారివైపు నుంచికాదు ఆనంద్ వైపునుంచి.

— - ఇంకా వుంది -



## పాపం మురళి

మురళి వేగంగా అడుగులువేసి సినిమా థియేటర్ చేరుకున్నాడు. టిక్కెట్లకి క్యూ చాలా పెద్దగా ఉంది. అదే మురళికి కావలసింది. నెమ్మదిగా ఆడవారి క్యూని చూస్తూ నడవసాగాడు.

ఒకచోట ఒక అందమైన అమ్మాయి రోజ్‌కలర్ శారీ కట్టుకొని నిలబడి వుంది. ఆమె చెల్లెలో, స్నేహితురాలో, పక్కనే చిన్న అమ్మాయి కూడా పంజాబీ డ్రస్‌లో చాలా అందంగా ఉంది. నెమ్మదిగా వారిని సమీపించాడు.

"మేడమ్" పలకరించాడు మురళి.

'ఏం కావాలి' అన్నట్లుగా చూసింది రోజ్ కలర్ శారీ అమ్మాయి.

"మగవారి క్యూ చాలా పెద్దదిగా ఉంది. కాస్త ఒక్క టికెట్ తీసిపెడ్తారా?" అడిగాడు మురళి.

"దాందేముంది" అంటూ డబ్బు తీసుకున్నారు.

మురళికి ఇదో సరదా. అమ్మాయిలకి డబ్బిచ్చి టికెట్ తీసుకోమంటాడు. వారి పక్కన కూర్చొని సినిమా చూసినంతసేపూ అదొక రకమైన థ్రిల్ అనుభవిస్తాడు.

ఇప్పుడూ అదే పని చేసాడు.

'అబ్బ ఎంత అందంగా ఉన్నారు ఇద్దరూ. ఆ ఇద్దరిలో ఎవరి ప్రక్కన కూర్చొని సినిమా చూసినా, ఓహ్. ఇంత వరకూ ఇంత అందమైనవాళ్ళు నాకు తారసపడలేదు' ఇలా సాగుతున్నాయ్ మురళి ఆలోచనలు.

"ఏమ్ మిస్టర్! పక్కకు జరుగు" అన్న పోలీసు మాటతో ఈలోకంలోకి వచ్చాడు మురళి. అపుడు తెలిసింది తను అంత వరకూ లేడీస్ క్యూదగ్గర ఉన్నాడని. కాస్త వెనక్కు జరిగాడు.

బుకింగ్ దగ్గర లైటు వెలిగించి. టిక్కెట్లివ్వడం మొదలైంది.

రోజ్‌కలర్ శారీ టిక్కెట్లు తీసుకొని నడుస్తుంటే పంజాబీ డ్రస్ అమ్మాయి ఆమె వెనకే నడిచింది.

"మేడమ్" అంటూ పరిగెత్తాను వారి వైపు మురళి.

"ఏమిటి?" అడిగింది రోజ్ కలర్ శారీ అమ్మాయి.

"నా టిక్కెట్టు" నవ్వుతూ అడిగాడు మురళి.

"ఏం టికెట్?" ఆశ్చర్యంగా చూసింది ఆ అమ్మాయి.

"ఏమిటండీ అలా అంటారు? టికెట్ కోసమని ఐదు రూపాయలు ఇచ్చాను కదా." అడిగాడు మురళి.

"ఏయ్ మిష్టర్ నువ్వెవరో మాకు తెలీదు. నువ్వు మాకు డబ్బివ్వడమేమిటి? ఎక్కువ వాగావంటే, మావెంట పడుతున్నావని పోలీసు రిపోర్టిస్తాను" అంటూ ముందుకి సాగిపోయ్యారు.

"ఆడవాళ్ళకి డబ్బులిచ్చి టికెట్ తీసుకోమనిచెప్పి, సినిమా హాలులో పిచ్చివేషాలేసే ఇలాంటి రోగ్స్‌కి ఇలాంటి శాస్తే జరగాలి" అంటూ చెబుతున్న రోజ్‌కలర్ శారీనిచూసి అవాక్కయి పోయాడు పాపం మురళి

—బి. ఎస్. భవానీప్రసాద్ (హైదరాబాద్)

